**సమస్యలుంటే సాక్షికి చెప్పండి**

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**78932 44734**

నంబర్‌ను సంప్రదించండి


## క్లుప్తంగా

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

**కంచరపాలెం:** జోన్–2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లోని 11 కేవీ బర్మాక్యాంప్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, దేవేంద్రనగర్, కంచరపాలెం రైతుబజార్, రవీంద్ర నగర్, ఐటీఐ జంక్షన్, నలందనగర్, ఇంటిలిజెన్స్ కార్యాలయం ఏరియా, అశోక్‌నగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గా నగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, తుమ్మడపాలెం, గోకుల్‌నగర్, గౌరీనగర్, తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

### నేవల్ ఏరియాలో నాగుపాము కలకలం



నేవల్ పార్కులో నాగుపామును పట్టుకుంటున్న స్నేక్ క్యాచర్ నాగరాజు

**సింధియా:** సింధియా సమీపంలోని నేవల్ పార్కు ఏరియాలో నాగుపాము సంచారం కలకలం సృష్టించింది. ఆ ప్రాంతంలోని రోడ్డుపై తిరుగుతూ ఓ షెడ్డులో దూరడంతో అక్కడి సిబ్బంది చూసి స్నేక్ క్యాచర్ నాగరాజుకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. నాగరాజు అక్కడికి చేరుకుని నాగుపామును పట్టుకుని నిర్మానుష్య ప్రదేశంలో విడిచిపెట్టాడు. రానున్న వర్షాకాలంలో పాముల సంచారం అధికంగా ఉంటుందని, నియంత్రణ చర్యలు చేపడతామని నేవీ అధికారులు తెలిపారు.

### విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



ఏపీ టిడ్కో బ్రేకర్‌ను ప్రారంభిస్తున్న ఎస్ఈ మహేంద్రనాథ్

**పెందుర్తి:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వినియోగదారుల సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి చేస్తామని ఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ అన్నారు. చీమలాపల్లి 11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ ఏపీ టిడ్కో బ్రేకర్‌ను ఎస్ఈ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యుత్ సేవలు వినియోగదారులకు అందించేందుకు ఈ బ్రేకర్ ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు, డిప్యూటీ ఈఈలు సిరికి అప్పన్నబాబు, ఉదయ్‌కిరణ్, ఏఈఈలు రమణమూర్తి, అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### సెయిల్‌లో విలీనానికి సహకరించాలని వినతి

**ఉక్కునగరం:** విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేలా సహకరించాలని స్టీల్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నాయకులు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు నాయకులు బుధవారం పల్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అలసత్వం, నిర్లక్ష్యం వల్ల కొన్ని నెలలుగా ప్లాంట్ తీవ్ర గడ్డు పరిస్థితిలోకి నెట్టబడిందన్నారు. తద్వారా 6 నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితికి చేరుకుందన్నారు. ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడం వల్ల ప్లాంట్‌కు రా మెటీరియల్ లభించడంతో పాటు ఆర్థికంగా పూర్వ వైభవం కలుగుతుందన్నారు. సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడ శ్రీనివాసరావు తదితరులున్నారు.

# నిరాశ్రయులకు ఆపన్న హస్తం

- ఆసరా కల్పిస్తున్న నైట్ షెల్టర్
- సౌకర్యాల కల్పనపై జీవీఎంసీ అధికారుల దృష్టి
- రూ.7.85 లక్షలతో అదనపు అంతస్తు నిర్మాణం
- దాతల సాయంతో ఆధునిక వసతులు
- బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో సేవలు భేష్



బుచ్చిరాజుపాలెంలోని జీవీఎంసీ వసతి గృహం



సేదతీరుతున్న నిరాశ్రయులు

**విశాఖ విద్య:** నిరాశ్రయులకు నేనున్నాంటూ బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ ఆపన్న హస్తం అందిస్తోంది. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో అందరికీ దూరమై దిక్కుతోచని స్థితిలో ఉన్న ఎంతో మందికి ఆశ్రయం కల్పిస్తోంది. జీవీఎంసీతో పాటు దయగల దాతల సహకారంతో మూడు పూటలా పట్టెడన్నం లభిస్తోండడంతో నిరాశ్రయులు ఇక్కడ సేదతీరుతున్నారు.

**ఆసరా కల్పిస్తూ..**

నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిరాశ్రయుల కోసం 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలో వసతి గృహం ఏర్పాటు చేశారు. నిరాశ్రయుల రాత్రి బస కోసం ఏర్పాటు చేసినప్పటికీ ఏ దిక్కులేని అనాథలు, నా అన్న వారికి దూరమైన వారు ఇక్కడకు ఎక్కువగా వస్తుండడంతో దీని నిర్వహణపై జీవీఎంసీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. 25 మంది పురుషులకు ఆశ్రయం కల్పించేలా ఏర్పాట్లు చేసినా ఇక్కడ ఎప్పుడూ 30 మందికి పైగానే ఉంటారు. నగరంలోని మిగతా వసతి గృహాల కంటే బుచ్చిరాజుపాలెం షెల్టర్‌లో ఆశ్రయం పొందేందుకే ఎక్కువగా వస్తుండడంతో సౌకర్యాలు మెరుగుపరచాల్సిన అవసరాన్ని జీవీఎంసీ అధికారులు గుర్తించారు.

**రూ.7.85 లక్షలతో అదనపు భవనం**

బుచ్చిరాజుపాలెంలో నిర్వహిస్తున్న వసతి గృహానికి నిరాశ్రయుల తాకిడి దృష్ట్యా అదనపు అంతస్తు నిర్మించేలా జీవీఎంసీ అధికారులు నిధులు కేటాయించారు. రూ.7.85 లక్షలు మంజూరు కావడంతో రెండో అంతస్తు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఆశ్రయం పొందే వారికి అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించేలా నిర్మాణాలు చేపడుతున్నారు. అదనపు అంతస్తు నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని జీవీఎంసీ జోన్–8 అసిస్టెంట్ ఇంజినీర్ వెంకటలక్ష్మి తెలిపారు.

**దాతల సాయమే పెద్ద దిక్కు**

వసతి గృహాల్లో రాత్రి పూట మాత్రమే జీవీఎంసీ ద్వారా భోజనం పెడుతున్నారు. దీంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం దాతల సాయం కోసం ఎదురుచూడాల్సి వస్తోంది. షెల్టర్ మేనేజర్ మమత అల్పాహారం, మధ్యాహ్న భోజనం సమయానికి అందించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. షెల్టర్‌లో అందుతున్న సేవలను గుర్తించిన బెల్ యాజమాన్యం భవనం ముందు రేకులు షెడ్డునిర్మాణానికి ముందుకొచ్చింది. ఈ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అయితే జీవీఎంసీ ద్వారా మూడు పూటలా భోజనాలు అందిస్తే మేలు జరుగుతుందని ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వారు కోరుతున్నారు.



భవనంపై అదనపు అంతస్తు నిర్మాణం

### మా బిడ్డల్లా చూసుకుంటున్నాం



వసతి గృహంలో ఆశ్రయం పొందే వారిని మా బిడ్డల్లా చూసుకుంటున్నాం. అందరూ ఉన్నా అనాథలుగా వస్తున్న వారు ఎంతో మంది ఉన్నారు. అలాంటి వారి వివరాలు తెలుసుకొని వారి కటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తప్పిపోయిన వచ్చిన వారిని తిరిగి వారి ఇంటికి చేర్చే వరకూ ఇక్కడ ఆశ్రయం కల్పిస్తున్నాం. వారికి అన్ని రకాలుగా సేవలు అందిస్తున్నాం.

– ఎల్లేటి మమత, షెల్టర్ మేనేజర్

### వసతి గృహమే దిక్కు



నాలుగు నెలలుగా నేను ఇక్కడే ఉంటున్నాను. మాది విజయనగరం జిల్లా. నాకు ఎవరూ లేరు. షెల్టర్ నుంచి పొమ్మంటే మళ్లీ రోడ్డు మీద పడడమే తప్ప మరో గత్యంతరం లేదు. నాలాంటి వారికి ఇది ఎంతో అండగా ఉంటుంది. ఇక్కడ నిర్వాహకులు ఎంతో బాగా చూసుకుంటున్నారు. – వరహాలు

### షెల్టర్ నిర్వహణకు సహకారం



నిరాశ్రయుల వసతి గృహం నిర్వహణకు నా వంతు సహకారం అందిస్తున్నాను. దాతలు సాయం అందించేలా ప్రోత్సహిస్తున్నాను. మౌలిక సౌకర్యాల కల్పన కోసం అదనపు అంతస్తు నిర్మాణం చేపట్టేలా శ్రద్ధ తీసుకున్నాను. భవిష్యత్‌లో మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు నావంతు కృషి చేస్తాను.

– బొమ్మిడి రమణ, కార్పొరేటర్, 90వ వార్డు

# కూలిన విద్యుత్ స్తంభం

- తప్పిన ప్రమాదం
- నిలిచిన విద్యుత్ సరఫరా



విద్యుత్ హెచ్‌టీ లైన్ స్తంభంపై కూలిన విద్యుత్ షో ల్యాంప్ స్తంభం

**మల్కాపురం:** ఓ విద్యుత్ స్తంభం మరో విద్యుత్ హెచ్‌టీ లైన్ స్తంభంపై పడింది. దీంతో సుమారు 6 గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉక్క పోతతో ఆ ప్రాంత వాసులు తీవ్ర అసహనానికి గురయ్యారు.

**ఇదీ పరిస్థితి**

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం దరి గాంధీజీవీధి శివారు ప్రాంతంలో పదేళ్ల కిందట విద్యుత్ షో ల్యాంప్ స్తంభాన్ని ( ఇనుప స్తంభం ) జీవీఎంసీ విద్యుత్ విభాగ అధికారులు ఏర్పాటు చేశారు. అయితే స్తంభం దిగువ భాగం పూర్తిగా తుప్పు పట్టిపోయింది. కూలేందుకు సిద్ధంగా ఉందని కాలనీ వాసులు జీవీఎంసీ విద్యుత్ విభాగ సిబ్బందికి పలుమార్లు వినతి ద్వారా వివరించారు. అయినా వారు స్పందించకపోవడం కారణంగా బుధవారం మధ్యాహ్నం ఆ విద్యుత్ షో ల్యాంప్ స్తంభం సమీపంలో ఉన్న విద్యుత్ హెచ్‌టీ లైన్ పై పడింది. దీంతో నిప్పు రవ్వలు రాలడంతో పాటు శబ్దం వచ్చింది. దీంతో కాలనీ వాసులు ఒక్కసారి ఆందోళన చెందారు. విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వారు తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి వచ్చి పోక్లెయిన్ సాయంతో కూలిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి మరమ్మతులు చేపట్టారు. ఈ పనుల కారణంగా సుమారు 6 గంటల పాటు మల్కాపురం,గాంధీజీవీధి,రజకవీధి,గొల్లవీధి,పల్లివీధి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆయా ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఇళ్లలో ఉండలేక జనం బయటకు వచ్చి కాలక్షేపం చేశారు.

# నేరాల నియంత్రణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ చక్రధర్

**కంచరపాలెం:** ఎయిర్‌పోర్ట్ జోన్ పోలీసులు బుధవారం ఎన్ఏడీ కొత్తరోడ్డులోని నారాయణ కళాశాలలో ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిర్‌పోర్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చక్రధర్ మాట్లాడుతూ గంజాయి, ధూమపానం, మద్యం సేవించడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఎవరి వల్ల అయినా ఇబ్బందులు ఎదురైతే విద్యార్థులు డయల్ 100,112, 1930 నంబర్లు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సబ్ ఇన్‌స్పెక్టర్ కె. రామకృష్ణ, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం





మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

**మహారాణిపేట :** రానున్న వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, బోధకాలు వంటివి రాకుండా కాపాడుకోవాలన్నారు. జిల్లా మలేరియా అధికారి తులసీ రాజ్ దోమల వ్యాప్తిని అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. వారానికి ఒకసారి ఎయిర్ కూలర్‌లో నీటిని మార్చాలని, మురుగు నీటి నిల్వలపై వారానికి ఒకసారి కిరోసిన్ లేదా ఆయిల్ చల్లాలని తెలిపారు. గంబూషియా చేపలు దోమల కుంట్లలో వదిలితే దోమల ఉత్పత్తి జరగదన్నారు. జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు మాట్లాడుతూ దోమల బెడద నుంచి రక్షణకు దోమ తెరలు వాడాలన్నారు. జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ఎస్.జీవన్‌రాణి మాట్లాడుతూ దోమల నియంత్రణ మనందరి బాధ్యత కనుక పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు నిర్మూలించటంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందే కాకుండా ఎవరి ఇంట్లో వారు శ్రద్ధ వహించి దోమలు పెరగకుండా చూసుకోవాలన్నారు.

# ఉపనిషత్తులు విలువైన సంపద



మాట్లాడుతున్న రచయిత సత్యనారాయణమూర్తి

**సీతంపేట:** వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సమాజం, పాశ్చాత్య సమాజాల మీద ప్రభావం చూపాయని కవి, రచయిత డాక్టర్ కె.వి.సత్యనారాయణమూర్తి అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో 'ఉపనిషత్తులు మన విలువైన సంపదలు' అనే అంశంపై జరిగిన సాహిత్య సభలో ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. వేద కాలం పూర్వం నుంచి నేటి ఆధునిక సమాజం వరకు వేదాలు, ఉపనిషత్తులు భారతీయ, పాశ్చాత్య సమాజాలపై ఏ మేరకు ప్రభావం చూపాయో, వాటి అర్థాలను వివరించారు. అరిస్టాటిల్, వివేకానందుడు నుంచి నేటి ఆధునిక కవులు, తత్వవేత్తల మీద ఉపనిషత్తుల ప్రభావాన్ని తెలియజేశారు. గ్రీకు నుంచి అమెరికా వరకు పాశ్చాత్య కవులు వీటిని ఏ మేరకు ఆదరించారో వివరించారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ వేదాల్లో నాలుగు భాగాలైన సంహితలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తుల్లో ఒకటని పేర్కొన్నారు. ఇది పూర్తిగా జ్ఞాన కాండ అని, నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని, విదేశాల్లో సైతం ఈ విజ్ఞానం ఎందరో నేర్చుకుని లబ్ధి పొందుతున్నారని తెలిపారు. డాక్టర్ కె.జి.వేణు మాట్లాడుతూ ఉపనిషత్తులు మన పూర్వీకులు మనకు అందించిన అమూల్యమైన జ్ఞాన సంపదగా పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి.వి. సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, సిహెచ్.చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ, చింతా ప్రభాకర్, జగదీశ్వరరావు, పీవీఆర్ కుమార్, బి.రాధారాణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### 26న షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం



సమావేశంలో పాల్గొన్న సంఘ సభ్యులు

**మురళీనగర్:** ఈ నెల 26న హిందుస్థాన్ షిప్‌యార్డ్ రిటైర్డ్ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించాలని షిప్‌యార్డ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నిర్ణయించింది. మురళీనగర్ వాకర్స్ పార్కులో బుధవారం సాయంత్రం విశ్రాంత ఉద్యోగుల సంఘం నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యత్వ రుసుం రూ.250 వసూలు చేయాలని సభ్యులు తీర్మానించారు. ఈ నెల 26న మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో నిర్వహించే ఆత్మీయ సమావేశంలో పలు సమస్యలపై చర్చించడంతోపాటు 80 ఏళ్లు దాటిన వారిని సత్కరించాలని నిర్ణయించారు. సమావేశంలో షిప్‌యార్డ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బి.సూర్యనారాయణ, అధ్యక్షుడు బూసి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కె.సుధాకర్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యనారాయణ స్వామి తిరువీధి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



ఘాట్‌రోడ్డు మీదుగా సాగుతున్న తిరువీధి ఉత్సవంలో మహిళల కోలాటం



స్వామి వారి తిరువీధి ఉత్సవం

**దాబాగార్డెన్స్ :** ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం తిరువీధి రథయాత్ర అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు విశేష హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు తిరువీధి రథయాత్ర చేపట్టారు. స్వామి ఆలయం నుంచి ప్రారంభమైన తిరువీధి రథయాత్ర ఘాట్‌రోడ్డు, పూర్ణామార్కెట్, పోలీస్ బ్యారెక్స్, ఆంజనేయస్వామి ఆలయం మీదుగా తిరిగి సత్యనారాయణస్వామి ఆలయం వరకు సాగింది. దారి పొడవునా కోలాటం.. సంకీర్తనలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ ఈవో బుద్ద నాగజగదీష్ పర్యవేక్షించారు.

**నేడు వైదిక సదస్యం..**

దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక పూజలు, 9 గంటలకు సుదర్శన హోమం నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు వైదిక సదస్యం, మహదాశీర్వచనం (పండిత సత్కారం) చేపట్టనున్నారు.

# వాల్తేర్ డివిజన్ టెక్నీషియన్లకు ప్రత్యేక సదస్సు



సెమినార్‌లో పాల్గొన్న టెక్నీషియన్లతో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

**తాటిచెట్లపాలెం:** వాల్తేర్ డివిజన్, మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రైలు ఎస్కార్టింగ్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్లకు బుధవారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ఎలక్ట్రికల్ విధులు నిర్వర్తించే సిబ్బందికి నైపుణ్యాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు ఈ సెమినార్ ఏర్పాటు చేశారు. రైళ్లలో ప్రయాణించే సమయంలో ఎదురయ్యే లైటింగ్, ఏసీ, థర్మల్ కంఫర్ట్ వంటి సమస్యలను పరిష్కరించడంలో వీరు కీలకపాత్ర పోషిస్తుంటారు. ప్రయాణికులకు సుఖవంతమైన, సౌకర్యవంతమైన, భద్రతతో కూడిన ప్రయాణాన్ని అందించేందుకు వీరు నిత్యం రైళ్లలో ప్రయాణిస్తూ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తుంటారు. ఈ సందర్భంగా డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికులకు అత్యంత ప్రమాణాలతో కూడిన సేవలందించడమే తమ ప్రాధాన్యమని తెలిపారు. కౌన్సెలింగ్ సెమినార్ ద్వారా భద్రత, సురక్షితం గురించి టెక్నీషియన్లకు ఎన్నో విషయాలు తెలియజేసినట్లు చెప్పారు. ఆయా విభాగాల మధ్య ఉన్నతాధికారులతో కమ్యూనికేషన్ విధానాలు, టీం వర్క్, సహకారం అంశాలపై వివరించారు.

### సెయిల్‌లో విలీనంతో స్టీల్‌ప్లాంట్‌కు పూర్వ వైభవం

**అగనంపూడి:** విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేస్తే పూర్వ వైభవం చేకూరుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ప్రగడ వేణుబాబు, ఎన్నేటి రమణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1224వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగుతున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం వల్ల ఎవరికి ఏ లాభం చేకూరుతుందో తెలియదు గానీ, భారతదేశం జాతి రత్నాన్ని కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉక్కు కర్మాగారం ఉనికిని కోల్పోతే దేశంతో పాటు ఆంధ్ర రాష్ట్రానికి తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. ఐక్యతతో స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుందామన్నారు. కార్యక్రమంలో దుగ్గపు దానప్పలు, ఈశ్వరరావు, హరి, రమణ తదితరులు పాల్గొన్నారు.

# పార్కుల్లో వసతుల కల్పనకు చర్యలు

ఎమ్మెల్యే గణబాబు



వాకర్స్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

**మల్కాపురం:** జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని వాకర్స్ పార్కు, చిల్డ్రన్ పార్కులను ఎమ్మెల్యే పి.గణబాబు బుధవారం సందర్శించారు.జోన్–5 జెడ్సీ కృష్ణతో కలిసి తొలుత వాకర్స్ పార్కును పరిశీలించారు. పలు ప్రదేశాల్లో వ్యర్థాలను చూసిన ఆయన అసహనం వ్యక్తం చేశారు. నిత్యం వందల మంది వాకింగ్‌కు వచ్చే పార్కును ఇలాగానే నిర్వహిస్తారా అని వార్డు శానిటరీ అధికారిపై మండిపడ్డారు. అనంతరం వాకర్స్‌తో ఆయన కాసేపు ముచ్చటించారు. పార్కులో అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. వాకర్స్ వివరించిన సమస్యలను పరిష్కరించాలని జెడ్సీని ఆదేశించారు. అనంతరం చిల్డ్రన్ పార్కును సందర్శించారు. పచ్చటి వాతావరణం,మెరుగైన విద్యుత్ లైట్లు సౌకర్యంతో కూడిన ప్రాంగణాన్ని చూసి ముచ్చటపడ్డారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పొట్టిమూర్తి,మాత శ్రీను,జనసేన నాయకుడు మౌళి తదితరులు ఉన్నారు.

# స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎన్నికలు జరిపించాలి

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు వెంటనే జరిపించాలని విశాఖ ఉక్కు శ్రామిక సంఘం అధ్యక్షుడు ఎం.కోటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు డిమాండ్ చేశారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద బుధవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలు సాధించడంలో ఏఐటీయూసీ పూర్తిగా విఫలం చెందిందన్నారు. కార్మికుల హక్కులకు ఒక్కొక్కటి చొప్పున తాకట్టు పెట్టిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. అన్ని కమ్యూనిటీ వెల్ఫేర్ సెంటర్లను వ్యాపార కేంద్రాలు మార్చారన్నారు. యూనియన్ గుర్తింపు ఈ నెల 9తో ముగిసినందున వెంటనే ఎన్నికలు జరిపించాలన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కరణం సత్యారావు, బొడ్డు రమణ, కరణం సురేష్, యు అప్పలరాజు, కె. బాలయోగి పాల్గొన్నారు.

### సికిల్ సెల్ అనీమియా నిర్మూలనకు కార్యాచరణ

**మహారాణిపేట :** దేశంలో 2047 నాటికి సికిల్ సెల్ అనీమియా వ్యాధి నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రకటించిందని, దీనిని అమలు చేయవలసిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. బుధవారం సికిల్ సెల్ అనీమియా డే (రక్తహీనత దినం) సందర్భంగా మారికవలస బాలికల గిరిజన సంక్షేమ వసతి గృహంలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గిరిజన ప్రాంతాల్లో దీనిపై అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. సికిల్ సెల్ అనీమియా అంటే వారసత్వంగా వచ్చిన ఎర్ర రక్తకణాల రుగ్మతల సమూహమన్నారు. చాలా సంవత్సరాలు తగినంత మొత్తంలో ఆక్సిజన్ లేకపోవడం వల్ల శరీరంలోని ఏ భాగంలోనైనా కణజాలం నష్టానికి దారి తీస్తుందన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి లక్షణాల్లో ప్రధానంగా రక్త కణాల సంఖ్య తగ్గడం (రక్త హీనత), కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒంటి, కీళ్లనొప్పులు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట, తరచూ వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.ఉమావతి, నోడల్ అధికారి అఖిల, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కె.విశ్వనాథ్, హాస్టల్ వార్డెన్, మెడికల్ అధికారులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రజా రవాణాను బలోపేతం చేయాలి

**ఉక్కునగరం:** ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం కొత్త బస్సులు కొనుగోలు చేసి, ఆర్టీసీని బలోపేతం చేయాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం డిపోలో బుధవారం నిర్వహించిన ఈయూ సర్వసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత రవాణా ఇస్తున్న సందర్భంగా కొత్త బస్సుల సంఖ్య పెంచాలన్నారు. అదేవిధంగా ఉద్యోగుల నియామకాలు జరపడంతో పాటు 2017 పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ఈయూ జిల్లా అధ్యక్షుడు కె.సత్యమూర్తి కోరారు. సమావేశంలో ఈయూ నూతన డిపో అధ్యక్షునిగా కె.ఎస్. ప్రకాశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి బి.రాము, ఆర్.ఎస్.ఎ.రావు, ఐ.ఉమామహేశ్వరరావు, నారాయణమ్మ, పి.ఎ.కుమార్ తదితరులు పాల్గొన్నారు.


**సాక్షి**

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com